
75 ఫీట్ రోడ్డులో పెద్దగొయ్యిలా ఏర్పడిన యూజీడీ మ్యాన్‌హోల్


డాల్ఫిన్ హోటల్ వద్ద రోడ్డుపై గొయ్యి


జనతాబజార్ రోడ్డు దరి పెట్రోల్ బంక్ వద్ద రాళ్లు తేలిన గోతులు

అడుగుకో గొయ్యితో నరకయాతన

- అధ్వానంగా పూర్ణా మార్కెట్ పరిసర రోడ్లు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- ఎప్పటికప్పుడు లీకవుతున్న యూజీడీతో అవస్థలు

జగదాంబ : పూర్ణా మార్కెట్ సమీప రహదారుల్లో అడుగుకో గొయ్యి ఏర్పడడంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. వర్షాల సమయం లో ఆ గోతుల్లో నీరు నిలిచిపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. మరమ్మతులు చేపట్టాల్సిన అధికార యంత్రంగం చూసీచూడనట్టు వ్యవహరించడంతో ఇబ్బందులు పడుతున్నామని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్ణా మార్కెట్ సమీప బౌడారా రోడ్డు, 75 ఫీట్ రోడ్డు, రామకృష్ణ రోడ్డు, రామకృష్ణ జంక్షన్, డాల్ఫిన్ రోడ్డు, జనతాబజార్ రహదారి, హార్బర్ స్టేషన్ రోడ్డు పూర్తిగా గోతులమయమయ్యాయి. ఇటీవల తెరిపివ్వకుండా కురిసిన వర్షాలకు మరింతగా రాళ్లు తేలి ప్రమాదకరంగా మారాయి. పూర్ణామార్కెట్‌కు నిత్యం వేలాది మంది రావడంతోపాటు వన్‌టౌన్‌కు వచ్చే వారంతా గోతుల రోడ్లపై ప్రయాణం చేయలేక నరకయాతన అనుభవిస్తున్నారు.

నిత్యం పొంగుతున్న మ్యాన్‌హోల్

జీవీఎంసీ 35వ వార్డు 75 ఫీట్ రోడ్డులో ఓ యూజీడీ మ్యాన్‌హోల్ వాహనచోదకులకు నరకం చూపిస్తోంది. కొన్ని సంవత్సరాల నుంచి ఇక్కడ ఇదే పరిస్థితి ఉన్నా జీవీఎంసీ యూజీడీ సెక్షన్ అధికారులు కనీసం స్పందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి వర్షానికే ఈ యూజీడీ పొంగి ప్రవహించడంతో పెద్ద గెడ్డను తలపిస్తోందని స్థానికులు అంటున్నారు. ఇటీవల వర్షం కురిసిన ప్రతిసారీ యూజీడీ పొంగిపోయి మురుగు నీరు రోడ్డుపైకి వచ్చినా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదని మండిపడుతున్నారు. జనతాబజార్, పూర్ణామార్కెట్ జంక్షన్ వద్ద కూడా యూజీడీలు ఇదే విధంగా ఉన్నాయని ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. గోతుల రహదారులు, మ్యాన్‌హోల్ సమస్యను జోన్ – 4 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంతోషికుమారి వద్ద 'సాక్షి' ప్రస్తావించగా... ఇటీవల వర్షాలు కురవడంతో రోడ్లు గోతులమయమయ్యాయని... మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.


రామకృష్ణ జంక్షన్ వద్ద భారీ గొయ్యి

యూజీడీ సమస్యతో ఇబ్బందులు



స్థానిక 75 ఫీట్ రోడ్డులోని యూజీడీ ఎప్పటికప్పుడు పొంగి ప్రవహించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నాం. అనేక ప్రమాదాలూ జరుగుతున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించాలి.

– మూర్తి, ఆటో డ్రైవర్, కల్లుపాకలు


మరమ్మతులు చేయించాలి



పూర్ణామార్కెట్‌కు నిత్యం వేలాది మంది వస్తుంటారు. రోడ్లు బాగోకపోయినా తప్పక రావాల్సి వస్తోంది. వాహనదారులు పన్నులు చెల్లిస్తున్నా రహదారులకు మరమ్మతులు చేపట్టకపోవడం దారుణం. కొత్తగా రోడ్లు నిర్మించకపోయినా గోతులు పూడ్చి మరమ్మతులైనా చేపట్టాలి.

– వెంకటరావు, ఆటో డ్రైవర్, 75 ఫీట్ రోడ్డు

సిరుల తల్లికి క్షీరాభిషేకం


అమ్మవారికి క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు,వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈవో మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అమ్మవారికి క్షీరాభిషేక సేవ ఉంటుందని, పాల్గొనదలిచే వారు రూ.500 చెల్లించాలని తెలిపారు. వివరాలకు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు సహస్ర తులసి పూజ

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ప్రతినిధులు తెలిపారు. పాల్గొనాలనుకునే వారు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో పూజా రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. ట్రాన్సాక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలని తెలియజేశారు.

క్లుప్తంగా

ఘనంగా హిందీ వారోత్సవాలు


విద్యార్థిని సత్కరిస్తున్న హిందీ అధ్యాపకులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి నేతృత్వంలో శుక్రవారం హిందీ వారోత్సవాలు కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ ఘనంగా ప్రారంభించారు. వీఎస్ కృష్ణ ప్రభుత్వ కళాశాల హిందీ అధ్యాపకులు అచార్య డాక్టర్ బి.లక్ష్మి మాట్లాడుతూ రాజ్యభాష హిందీ ప్రాముఖ్యతను తెలిపారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆహుతుల్ని అలరించాయి. ఎన్‌ఎస్‌ఎస్ బెస్ట్ వలంటీర్‌గా రాష్ట్ర స్థాయి అవార్డు సాధించిన అన్నువాకి 'దేవనాగరి' పురస్కారంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.దీప్తి, రెజీనా, సోఫియా, సర్తాజ్, పాల్గొన్నారు.

దోమల బ్యాట్ల పంపిణీ


ఆశ్రమంలో దోమల బ్యాట్లు అందజేస్తున్న మక్సూద్ అహ్మద్

దాబాగార్డెన్స్: రౌండ్ టేబుల్ సంస్థ ఆంధ్ర, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల చైర్మన్ మక్సూద్ అహ్మద్ పాత నగరంలోని వివేకానంద సంస్థలో శుక్రవారం దోమల బ్యాట్లు అందించారు. ఆశ్రమంలో ఉంటున్న వారితో పాటు పేదలకు వీటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా దోమలు విపరీతంగా పెరిగి, జ్వరాలకు దారి తీస్తున్నందున రౌండ్ టేబుల్ తరపున వీటిని అందించామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, మహిళా సభ్యులు ఉమాదేవి, కనకమహాలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలు


బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించిన కళాశాల హెల్త్‌క్లబ్, ఫౌండేషన్ సభ్యులు

దాబాగార్డెన్స్: 'స్వస్థ మహిళా– స్వస్థ భారత్' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల హెల్త్ క్లబ్ విభాగం , యువీ కెన్ ఫౌండేషన్ సహకారంతో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అధ్యాపకులకు హెల్త్ క్లబ్ కన్వీనర్ ఎ. జోయతి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, యువీ కెన్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ ప్రతినిధులు డాక్టర్ మాధురి, డాక్టర్ సాయిచరిత, తేజస్వి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

35వ వార్డులో అన్నదానం


అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనక రెడ్డి

జగదాంబ : వినాయక చవితిని పురస్కరించుకుని జీవీఎంసీ 35వ వార్డు పరిధి దుర్గమాంబ సమాజం వద్ద భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. శుక్రవారం దుర్గా సాయి తారకరామ సేవా సంఘం ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మూడు వేల మందికి అన్నదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నదానాన్ని మించిన దానం లేదన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


భీమ్‌నగర్‌లో అవగాహన ర్యాలీలో సిబ్బంది

అల్లిపురం : సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణ కోసం పరిసరాల పరిశుభ్రత పాటించాలని మలేరియా నివారణ విభాగం సిబ్బంది సూచించారు. భీమ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో స్థానికులకు శుక్రవారం అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ మురళి ఆధ్వర్యంలో భీమ్‌నగర్ ప్రాంతంలో డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణపై అవగాహన కల్పించి... పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మూడు చెత్త బుట్టల విధానం అమలు చేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి మంచినీటి తొట్లలోని దోమ లార్వాను గుర్తించి తొలగించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్, మలేరియా సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మేల్ నర్స్ కోటీశ్వరరావుపై చర్యలకు వినతి


కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఏఎన్‌ఎంలు

మహారాణిపేట: ఏఎన్‌ఎంలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న కేజీహెచ్‌లో కాంట్రాక్టు మేల్ నర్సు జి.కోటీశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఏఎన్‌ఎంల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.వెంకట లక్ష్మి కోరారు. ఈ మేరకు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆమె మాట్లాడుతూ కేజీహెచ్‌లో దాదాపు రెండున్నర సంవత్సరాల నుంచి పనిచేస్తున్న 70 మంది ఏఎన్‌ఎంలు జీఎన్‌ఎం శిక్షణ కోసం వెళ్లారని తెలిపారు. వారిపై కోటీశ్వరరావు సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. కోటీశ్వరరావు ఆగడాలు శృతి మించుతున్నాయని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వినతి పత్రాన్ని డీఎంఈకి, వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపినట్లు వెంకట లక్ష్మి వివరించారు.

విజయవాడలో జీవీఎంసీ కమిషనర్ పర్యటన


వరద ముంపు ప్రాంతాల్లో మంత్రితో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

దాబాగార్డెన్స్: విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణతో పాటు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ శుక్రవారం పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ 64వ వార్డులోని కండ్రిక, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాలతో పాటు 282, 284 సచివాలయాల్లో పర్యటించినట్లు చెప్పారు. ఉదయం ముంపు ప్రాంతాల్లో పర్యటించి, సాయంత్రానికి గల్పర్ మిషన్లతో ఆ నీటిని తొలగించినట్లు పేర్కొన్నారు. బాధితులకు మౌలిక సదుపాయాలు, నిత్యావసర సరకులు అందజేస్తున్నామని కమిషనర్ తెలిపారు.

'యూ జీనియస్ 3.0' క్విజ్ పోటీల విజేత డీపాల్


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్


విజేతలకు జ్ఞాపికలు బహూకరిస్తున్న సీపీ బాగ్చి

సీతంపేట: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జోనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో 8 నుంచి 12 ఏళ్ల వయసు గల విద్యార్థులకు 'యూ జీనియస్ 3.0'నేషనల్ జనరల్ అవేర్‌నెస్ క్విజ్ కాంపిటేషన్–2024 పోటీలు జరిగాయి. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 116 పాఠశాలల నుంచి 435 బృందాలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాయి. కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ ముఖ్య అతిథిగా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానం, ప్రతిభా పాటవాలు ఇటువంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా గుర్తించవచ్చన్నారు. ఈ పోటీల్లో డిపాల్ స్కూల్ విజేతగా, విశాఖ వ్యాలీ స్కూల్ రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బహుమతులు, జ్ఞాపిక, ధ్రువీకరణపత్రాలు అందించారు. ఈ రెండు జట్లు ముంబయిలో జరగనున్న గ్రాండ్ ఫినాలేలో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. గ్రాండ్ ఫినాలే విజేతకు రూ.2 లక్షలు, మొదటి రన్నర్‌కు రూ.లక్ష, రెండవ రన్నర్‌కు రూ.50 వేలు బహూకరిస్తారన్నారు. యూనియన్ బ్యాంకు జోనల్ హెడ్ షాలిని మీనన్, డిప్యూటీ జోనల్ హెడ్‌లు దేవర శంకరరావు, శంకర్ హెంబ్రామ్, విశాఖ రీజనల్ హెడ్ నరసింహకుమార్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే


స్కూల్‌లో బామ్మతో విద్యార్థులు

అల్లిపురం : అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు నేటి తరానికి తిరుగులేని ఆస్తి అని, వారి అనుభవాలు జీవిత పాఠాలుగా స్వీకరించాలని రవీంద్ర భారతి స్కూల్ ప్రిన్సిపాల్ పి.శారదరెడ్డి సూచించారు. డాబాగార్డెన్స్‌లోని రవీంద్రభారతి స్కూల్‌లో శుక్రవారం గ్రాండ్ పేరెంట్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటిలోనూ తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు ఉంటారని... వారితో ప్రేమగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా 150 మంది గ్రాండ్ పేరెంట్స్‌ను సత్కరించారు.

'ఎగుమతి వ్యాపారం'పై సర్టిఫికెట్ కోర్సు

విశాఖ సిటీ: ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో 'ఎగుమతి వ్యాపారాన్ని ఎలా ప్రారంభించాలి'అన్న అంశంపై ఐదు రోజుల ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి పి.వైదేహి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ సెషన్లు ఉంటాయని వివరించారు. మర్చంట్ ఎగుమతిదారులు, తయారీదారులు, సర్వీస్ ప్రొవైడర్లు, ఎస్ఎంఈలు, వ్యాపారులు, భావి ఎగుమతిదారులు/వ్యాపారవేత్తలు ఈ ఆన్‌లైన్ ప్రోగ్రాంకు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 93914 22821కు సంప్రదించవచ్చు.

కేజీహెచ్‌లో ట్రైబల్ సెల్ తనిఖీ

- క్షతగాత్రులను పరామర్శించిన ఏఎస్సార్ డీఎంహెచ్‌వో జమాల్‌బాషా
- బాధితులకు వైద్యసేవలపై సంతృప్తి


కేజీహెచ్‌లో గిరిజనులకు అందుతున్న వైద్యాన్ని పరిశీలిస్తున్న అల్లూరి జిల్లా డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

మహారాణిపేట (విశాఖ) : కేజీహెచ్‌లో ట్రైబల్ సెల్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జమాల్‌బాషా శుక్రవారం తనిఖీ చేశారు. ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి గాయాలపాలైన కొర్ర రామారావు, కొర్ర పండన్న, కొర్ర సుమిత్ర, కొర్ర సుబ్బారావు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. వీరి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్న డీఎంహెచ్‌వో అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యం కోసం ట్రైబల్ సెల్‌కు వచ్చే రోగులకు సత్వర వైద్యం అందించాలని ఆయన ఆదేశించారు. ఇక్కడి వైద్యాధికారులు, సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్యాధికారులు డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ గాయత్రి పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రోగ్రాం శీతాకాల ప్రవేశాలు ప్రారంభం

బీచ్‌రోడ్డు: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ) ప్రోగ్రాం కోసం శీతాకాల ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రోగ్రాం ద్వారా అభ్యర్థులకు సమగ్ర నిర్వహణ సామర్థ్యాలను అందించడమే లక్ష్యమని ఐఐఎం వీ డైరెక్టర్ చంద్రశేఖర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అధునాతన మేనేజ్‌మెంట్ నైపుణ్యంతో పని చేసే నిపుణులను శక్తివంతం చేయడం లక్ష్యంగా టైమ్స్‌ప్రో సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ ప్రోగ్రాం వ్యూహాత్మక దూరదృష్టితో ముందుకు వెళ్లగల నాయకులను తయారు చేయడానికి రూపొందించిందని వెల్లడించారు. మార్కెటింగ్, ఆర్థికశాస్త్రం , ఫైనాన్స్, అకౌంటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మానవ వనరులు, వ్యూహాత్మక ఆలోచన, ఉత్పత్తి, ఆపరేషన్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, బిజినెస్ ఎథిక్స్, చట్టం తదితర అంశాలు ఈ ప్రోగ్రాంలో ఉంటాయని వివరించారు.

యూజీడీకి మరమ్మతులు


సీబీఎం కాంపౌండ్ రోడ్డులో యూజీడీ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ జోన్–3 పరిధి 27వ వార్డు సీబీఎం కాంపౌండ్ రోడ్డులో తరచూ లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్‌కు ఎట్టకేలకు అధికారులు మరమ్మతులు నిర్వహించారు. ఈ ప్రాంతంలో నిత్యం యూజీడీ లీకై రోడ్లు ముంపునకు గురవుతున్నాయని స్థానికులు గగ్గోలు పెడుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇక్కడి టింపనీ స్కూల్ సీ–గేటు ఎదురుగా గల రోడ్డులో యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతున్న సమస్యపై «సాక్షి»లో ప్రచురించిన వార్తకు జోన్–3 పబ్లిక్ వర్క్స్ విభాగం అధికారులు స్పందించారు. వార్డు యూజీడీ ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజినీర్ శివకుమార్ పర్యవేక్షణలో సిబ్బంది శుక్రవారం యూజీడీకి మరమ్మతులు చేపట్టారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు దేశభక్తి బృందగాన పోటీలు


విజేతలతో భారత్ వికాస్ పరిషత్, ఝాన్సీ లక్ష్మీభాయి మహిళా శాఖ సభ్యులు

దాబాగార్డెన్స్: భారత్ వికాస్ పరిషత్ విశాఖ శాఖ, ఝాన్సీలక్ష్మీ భాయి మహిళా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి జాతీయ దేశభక్తి బృందగాన పోటీలు నిర్వహించారు. పాతనగరంలోని ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో నిర్వహించిన కార్యక్రమాన్ని పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో నగరానికి చెందిన పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొని హిందీ, సంస్కృతంతో పాటు తెలుగులో దేశభక్తి గీతాలను ఆలపించారు. నగరానికి చెందిన సంగీత ప్రముఖులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతీ పాఠశాలకు జ్ఞాపికను, విద్యార్థులకు ప్రశంసా పత్రాలను సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి దేశభక్తి భావనను అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో నరేష్‌కుమార్, బీవీ ప్రతినిధులు వంకాయల సన్యాసిరాజు, రమేష్‌చంద్ జైన్, ఎంవీవీ సత్యనారాయణ, ఎంవీ రాజశేఖర్, సీహెచ్‌వీ సత్యనారాయణ పి.భాస్కరరావు, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE COURT OF THE HON'BLE PRINCIPAL, SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM

Succession SOP No. 20 of 2024

In the matter of succession of movables of Late Mrs. Santhi Jyothi Martin

Between:

Mr. Julius Selveyraj Martin, S/o. F Martin, Christian, aged about 65 years, R/o. Flat No. B-4, Chaitanya Apartments, Rajendra Nagar, Visakhapatnam (urban), Visakhapatnam, Andhra Pradesh -530016. ..... **Petitioner**

And:

1. **The Branch Manager, Geojit Financial Services Ltd**, Registered office at 34/659-P, Civil Line Road, Padivattom, Kochi, Kerala -682024.
2. **Mr. Jeyes Andrew Martin**, S/o. Mr. Julius Selveraj Martin, aged about 31 years, temporarily residing at 801, Lake Carolyn Pkwy, Apartment No. 4036, Irving, TX 7039 USA and permanent resident of 43-19-3, TSN Colony, 2nd lane, Dondaparthy, Visakhapatnam (urban), Visakhapatnam, Andhra Pradesh - 530016. ..... **Respondents**

PUBLIC NOTICE

The general public is hereby notified that the above petition has been filed by **Mr. Julius Selveyraj Martin (Petitioner)** for the grant of Succession Certificate in his favour, along with **Mr. Jeyes Andrew Martin (2nd Respondent)**, regarding the shareholdings of Late **Mrs. Santhi Jyothi Martin**, currently in the custody of **The Branch Manager, Geojit Financial Services Ltd. (1st Respondent)**

Any person having objections to this petition is required to appear before the Court either in person or through a duly instructed pleader, capable of answering all material questions related to the matter, on **26-09-2024 at 10:30 A.M.** Failure to appear at the specified date and time may result in the matter being heard and determined in accordance with the law.

Visakhapatnam
Dt: 14-09-2024

KAIKALA RAMA KIREETI, Advocate
D.No. 14-37-16/1, "ASHRAM", Gokhale Road, Maharanipeta, Visakhapatnam -530002
Cell : **8500881555**

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

మర్రిపాలెం :విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి సూర్యానగర్ వద్ద గురువారం రాత్రి వినాయక నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఆ సమయంలో కంచరపాలెం పీఎస్ కానిస్టేబుళ్లు నారాయణ, భూలక్ష్మి, అక్కునాయుడు, ఎస్‌వీ రమణ విధుల్లో ఉన్నారు. ఈ క్రమంలో రాత్రి 10. 30 గంటలు దాటిందని, నిబంధనలు అతిక్రమించకూడదని నిర్వాహకులను కోరారు. అయినా పట్టించుకోకుండా నిర్వాహకులు, స్థానిక యువకులు కలిసి చిందులేశారు. ఈ విషయమై పోలీసులు మరోసారి చెప్పడంతో సత్యనగర్ ప్రాంతానికి చెందిన నీలపు రమేష్ దురుసుగా ప్రవర్తించడంతో కానిస్టేబుల్ రమణ కింద పడిపోయారు. దీంతో అతను కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు రమేష్‌ను అదుపులోకి తీసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు మొక్కల పంపిణీ

సీతంపేట : శ్రీసాయి సరిగమప ట్రస్ట్, బృందావన హెల్పింగ్ హ్యాండ్స్ సంయుక్తంగా 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో గల జీవీఎంసీ హైస్కూల్‌లో శుక్రవారం వన సంరక్షణ, వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 500 మంది విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్పొరేటర్ ముక్కా శ్రావణి, హెచ్ఎం బి.లక్ష్మీ నరస, సంస్థ వ్యవస్థాపకులు హర్షవల్లి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ రేవు రత్నకుమారి, ఉపాధ్యాయులు మాణిక్యం, సునంద్, కిషోర్, ధర్మారావు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ వంగల అప్పలరాజు, సాయి సరిగమప సభ్యులు సుబ్రహ్మణ్యం, గోవిందరాజు, శ్యామల, సాయి కుమార్, దుర్గా ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.